క్లుప్తంగా

సిరులతల్లికి పంచామృతాభిషేకం


కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అల్లిపురం: టౌన్ కొత్తరోడ్డు ప్రాంతం 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు సబ్ స్టేషన్ నిర్వహణ కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జోన్-1 ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. టౌన్ కొత్తరోడ్డు ప్రాంత విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కేజీహెచ్‌ను సందర్శించిన యూఎస్ వైద్యుడు


డాక్టర్ బ్రూస్‌తో కేజీహెచ్ ఆర్థోపెడిక్ వైద్యులు తదితరులు

మహారాణిపేట: యూఎస్‌ఏకు చెందిన ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ బ్రూస్ స్మిత్ గురువారం కేజీహెచ్‌ను సందర్శించి పాన్సెటీ టెక్నిక్‌పై తన అనుభవం పంచుకున్నారు. ఆర్థోపెడిక్ డిపార్ట్‌మెంట్‌ను సందర్శించి వైద్యులతో ముచ్చటించారు. పాన్సెటీ టెక్నిక్‌ను పిల్లల్లోని వంకర పాదాన్ని సరి చేసే చికిత్సలో ఉపయోగిస్తారన్నారు. పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థుల ప్రయోజనార్థం పాన్సెటీ టెక్నిక్‌ని ప్రదర్శించి వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ బ్రూస్ స్మిత్‌ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్, ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ పి.శివానంద, ప్రొఫెసర్లు డాక్టర్ ఎం. చంద్రశేఖరం నాయుడు, డాక్టర్ ఎల్. లోకనాథరావు, ఆర్థో విభాగం వైద్యులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు పాల్గొనారు.

నూతన బోర్‌వెల్ ఏర్పాటు


బోర్‌వెల్ వేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ శివానంద్ తదితరులు

మహారాణిపేట: కేజీహెచ్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రాంగణంలో శ్రీకాకుళానికి చెందిన కారిమల్ ప్రేయర్ ఫెలోషిప్ చర్చి పాస్టర్ పీఏ స్వామి సహకారంతో బోర్ వెల్ ఏర్పాటు చేశారు. రూ.లక్ష 50 వేలు విలువ చేసే బోర్ వెల్‌ను గురువారం కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ చూసి పీఏ స్వామి, విజయబాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ డీసీఎస్ ఆర్‌ఎంవో డాక్టర్ జి.మోహన్‌కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ జి.వాసవీలత, నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ జామ్‌తో ఇక్కట్లు


రెడ్డి ఆస్పత్రి రోడ్‌లో ట్రాఫిక్ జామ్ వల్ల వెనుదిరుగుతున్న వాహన చోదకులు

సీతంపేట : రామాటాకీస్ సమీప శ్రీనగర్‌లో రెడ్డి హాస్పిటల్ రోడ్‌లో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ మార్గంలో కార్లు, ద్విచక్ర వాహనాలు రోడ్డుకి రెండు వైపులా ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రహదారి ఇరుగ్గా మారి ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పుకునే వీలులేక తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. రామాటాకీస్ రోడ్ నుంచి వీటీ స్కూల్ మీదుగా ద్వారకానగర్ వెళ్లడానికి అనువైన రహదారి కావడంతో ఈ మార్గం నిత్యం రద్దీగా ఉంటుంది. ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


బీఆర్‌టీఎస్ సబ్‌వే రహదారిలో ఆటోలు


కంచరపాలెం కూడలిలోని సబ్‌వే రహదారిలో సాయంత్రం వేళ ట్రాఫిక్

జంక్షన్ టెన్షన్

- బాబోయ్ కాన్వెంట్ కూడలి రహదారులు
- నిత్యం ట్రాఫిక్ జామ్‌తో ప్రయాణికుల ఇక్కట్లు
- కానరాని సిగ్నల్స్
- ప్రమాదాలకు నిలయంగా హోల్‌సేల్ మార్కెట్ కూడలి

కంచరపాలెం:

కాన్వెంట్ కూడలిలో భారీ వాహనాల రద్దీతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు, ఉద్యోగులు, స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ సమయంలో ఎలాంటి ప్రమాదం బారిన పడతామో అని ఆందోళనలోనే నిత్యం రాకపోకలు సాగిస్తున్నామంటున్నారు. నిత్యం జ్ఞానాపురంలోని కాన్వెంట్ కూడలిలో గల న్యూహోల్‌సేల్ మార్కెట్‌కు వచ్చే భారీ కూరగాయల వాహనాలు, ఆటోలు, గూడ్స్ వాహనాలు రోడ్లపై నిలిపేస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. పగలు ఎలా ఉన్నా రాత్రిళ్లు మాత్రం రహదారులు మరీ దారుణంగా ఉంటున్నాయి. ఇక్కడికి సమీపంలోనే ఎర్నిమాంబ ఆలయం, ఎయిడెడ్ కళాశాలలు, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు ఉండడంతో వేల సంఖ్యలో విద్యార్థులు, భక్తులు రాకపోకలు సాగిస్తుంటారు. ఉదయం, సాయంత్రం వేళల్లో డాక్‌యార్డ్, ఎస్సార్ కంపెనీ, పోర్ట్, సింథియా, షీలానగర్, గాజువాక ప్రాంతాల్లోని సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు ప్రయాణిస్తుంటారు. అలాగే జ్ఞానాపురం రైల్వేస్టేషన్‌కి వెళ్లే ప్రయాణికులు, సింహాచలం వెళ్లే వాహన చోదకులు, భక్తులు తీవ్రమైన ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుంటున్నారు. ప్రజాధనంతో, ప్రజల భద్రత కోసం ఏర్పాటు చేయాల్సిన ట్రాఫిక్ సిగ్నల్స్ కూడలిలో కానరావడం లేదని వాహన చోదకులు చెబుతున్నారు.

పెరుగుతున్న ట్రాఫిక్‌తో ఇక్కట్లు..

కాన్వెంట్ వంతెన ప్రాంతం, జ్ఞానాపురం రైల్వేస్టేషన్ కూడలి, చావులమదుం, కాన్వెంట్ కూడలి నుంచి గాజువాక వెళ్లే రహదారిలో రోజురోజుకి ట్రాఫిక్ పెరిగిపోవడంతో సులువుగా రాకపోకలు జరగడంలేదు. ఇక సాయంత్రం అయితే ట్రాఫిక్‌ని నియంత్రించటానికి పోలీసులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంతాల్లో వేకువ జాము, రాత్రి సమయాల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని చెబుతున్నారు.

ఎన్నో ప్రమాదాలు..

సిగ్నల్ లైట్లు లేకపోవడంతో కాన్వెంట్ జంక్షన్, జ్ఞానాపురం, చావులమదుం తదితర ప్రాంతాల్లో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీనిపై ప్రజా ప్రతినిధులు గానీ.. అధికారులు గానీ దృష్టి సారించడంలేదని వాహన చోదకులు ఆరోపిస్తున్నారు. ప్రమాదాల నివారణకు ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు, సిగ్నల్ లైట్ల ఏర్పాటు సత్వరం జరగాలని డిమాండ్ చేస్తున్నారు.


కాన్వెంట్ జంక్షన్‌లో రాత్రివేళ ట్రాఫిక్ రద్దీ

ఆ దారిలో ప్రయాణమంటేనే భయం

జ్ఞానాపురం పరిసరాల్లోని పలు చోట్ల ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆ ప్రాంతాల మీదుగా ప్రయాణం అంటేనే భయంగా ఉంటుంది. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్య పరిష్కరించాలి.
– వి.పైడిరాజు వాహన చోదకుడు, జ్ఞానాపురం

నిత్యం ట్రాఫిక్ జామ్..

కాన్వెంట్ కూడలిలోని హోల్‌సేల్ మార్కెట్‌కు వచ్చే లారీలు, ఇతర వాహనాల వల్ల తీవ్రమైన ట్రాఫిక్ జామ్ అవుతోంది. అలాగే సబ్‌వే రహదారిలోని ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేయడంతో అక్కడికి వచ్చే వారు తమ వాహనాలను అడ్డదిడ్డంగా పెట్టడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.
– గోపవరపు గీతాలక్ష్మి, స్థానికురాలు, జ్ఞానాపురం

ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు..

బీఆర్‌టీఎస్ రహదారిలో ట్రాఫిక్ పోలీసులు అంతంత మాత్రంగానే కనిపిస్తున్నారు. ఇక్కడ సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. అధికారులు తగిన చర్యలు తీసుకుని ట్రాఫిక్ సమస్య తొలగించాలి.
– ఆనంద్ సాయికుమార్, వాహన చోదకుడు, కంచరపాలెం.

కార్యకర్త వైద్య ఖర్చులకు వాసుపల్లి సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 30వ వార్డు తాడివీధికి చెందిన వైఎస్సార్‌సీపీ యువ కార్యకర్త పెంట రవికి ఇటీవల రోడ్డు ప్రమాదం జరిగింది. సమాచారం తెలుసుకున్న వాసుపల్లి రవి ఇంటికి గురువారం నేరుగా వెళ్లి పరామర్శించారు. వైద్య ఖర్చుల కోసం రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆరోగ్యపరంగా ఏ సమస్య వచ్చినా తనకు తెలియజేస్తే సహాయం అందిస్తానని ఆ కుటుంబానికి భరోసా కల్పించారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్, సౌత్ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు సూర్య, 30వ వార్డు నాయకుడు దశమంతుల చిన్ని, యువజన విభాగం అధ్యక్షుడు తాడి రవితేజ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆకుల శ్యామ్, వార్డు బీసీ సెల్ అధ్యక్షుడు వేణు, వార్డు మహిళా ప్రెసిడెంట్ రాము, జగన్, సారిపల్లి అప్పలరాజు, త్రినాథ్‌రెడ్డి, మణి, మీనా, కల్యాణి, తిరుమల, గనగల రామరాజు తదితరులు పాల్గొన్నారు.

8న భీష్మ ఏకాదశి వేడుకలు


ఉత్సవాల కరపత్రం ఆవిష్కరిస్తున్న ఈవో రమాబాయి తదితరులు

సీతమ్మధార: దొండపర్తిలో గల శ్రీ ఎరుకుమాంబ అమ్మవారి దేవస్థానంలో ఈనెల 8, 9 తేదీల్లో భీష్మ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో జి.వి.రమాబాయి తెలిపారు. దేవస్థానంలో గురువారం జరిగిన కార్యక్రమంలో వేడుకలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 8వ తేదీ ఉదయం 6 నుండి మర్నాడు ఉదయం 6 వరకు జరుగుతుందని తెలిపారు. ఆలయ ఆవరణలో సంకీర్తనలు, భక్తి గీతాలాపన జరుగుతాయన్నారు. అలాగే ఈ నెల 26వ తేదీన మహా శివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహిస్తామన్నారు. భక్తులు పాల్గొనాలని కోరారు. ప్రతినెల మూడవ గురువారం ఆలయంలో పేదలకు అన్న సంతర్పణ జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అర్చకులు జి.శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ పితాని సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

బల్లిగిరిలో ఏకాదశి పూజలు


విశేష అలంకరణలో బల్లిగిరి వెంకన్న

అల్లిపురం: ఈ నెల 8వ తేదీ మాఘ శుద్ధ ఏకాదశి, భీష్మ ఏకాదశి సందర్భంగా శనివారం బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో జీవీ రమాబాయి తెలిపారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు స్వామివారికి విశేష అర్చనలు అభిషేకాలు ఉంటాయన్నారు. అదే విధంగా నియోజకవర్గంలో అల్లిపురం మెయిన్‌రోడ్డు కోదండ రామాలయం, కుమ్మరవీధి రామాలయం, గోవింద్‌రోడ్డు రాంరాం దేవాలయం, మెయిన్ రోడ్డు శ్రీ రామాలయంలో విశేష పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాస కల్యాణం..

భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని వెంకటేశ్వరమెట్టపై వెలసిన శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాస కల్యాణం శనివారం సాయంత్రం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు పానంగిపల్లి కేశవాచార్యులు తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనదలచుకుంటే ముందుగా దేవాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థినులకు అవగాహన


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌పి బాబు

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం కెరీర్ గైడెన్స్, పర్సనాల్టీ డెవలప్‌మెంట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల కెరీర్ గైడెన్స్ సెల్, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ యూత్ వెల్ఫేర్ కో ఆర్డినేటర్ ఎస్‌పి బాబు పాల్గొని విద్యార్థినులకు పర్సనాల్టీ డెవలప్‌మెంట్, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థినులు చదువుతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, లీడర్ షిప్ వంటి విషయాలపై పట్టు సాధించాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల తెలిపారు. కార్యక్రమంలో కెరీర్ గైడెన్స్ కో ఆర్డినేటర్ జె. సునీత, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు డాక్టర్ కేఎల్ శిరీష, డాక్టర్ జె. లావణ్య, అధిక సంఖ్యలో విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహానికి అభాగ్యులు


నిరాశ్రయ మహిళలతో మేనేజర్ జ్యోతిర్మయి



షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయితో అప్పారావు

సీతమ్మధార: శ్రీకుమారి (54) పెదవాల్తేరు బస్ షెల్టర్ వద్ద తిరుగాడుతుండగా ఏయూటీడీ నిర్వాహకులు షెల్టర్ హోంకు తరలించారు. అలాగే జ్ఞానాపురం వద్ద సుమతి (55), గోపాలపట్నం వద్ద అన్నమ్మ (45) అనే మహిళలను గుర్తించి షెల్టర్ హోంకు తరలించారు. వీరి మానసిక పరిస్థితి బాగు లేదని గుర్తించి చినవాల్తేరులో గల ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స తీసుకున్న వీరంతా కోలుకున్నారు. దీంతో వీరిని గురువారం డిశ్చార్జి చేసి షెల్టర్ హోంకి తరలించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ జ్యోతిర్మయి, ప్రశాంత్ చారి, కేర్‌టేకర్లు పాల్గొన్నారు.

షెల్టర్ హోంకు వృద్ధుడు..

భీమిలికి చెందిన దార అప్పారావు (75)కు ఇద్దరు పిల్లలు. వాళ్లు వివాహాలు చేసుకుని వేరేగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో అప్పారావు భార్య కూడా అతన్ని వదిలేసి వెళ్లిపోవడంతో ఒంటరి వాడైన అప్పారావు వారం రోజులుగా ద్వారకానగర్ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఉంటున్నాడు. ఏయూటీడీ సిబ్బంది ఇది గమనించి అప్పారావును షెల్టర్ హోంలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహం మేనేజర్ జ్యోతిర్మయి, కేర్‌టేకర్లు పాల్గొన్నారు.

మత్స్యకారుల మనోభావాలు దెబ్బతినేలా 'తండేల్' చిత్రం


మీడియాతో మాట్లాడుతున్న జానకిరామ్

సీతమ్మధార: ఉత్తరాంధ్ర మత్స్యకారుల జీవితాలను కథాంశంగా తీసుకుని నిర్మించిన 'తండేల్' సినిమా యదార్థ ఘటనలు వక్రీకరించి తీశారని ఆంధ్రప్రదేశ్ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వాసుపల్లి జానకి రామ్ అన్నారు. ఈ మేరకు గురువారం జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ చిత్రం మత్స్యకారుల మనోభావాలను దెబ్బతీసేలా ఉందని విమర్శించారు. కాబట్టి ఈ నెల 7న చిత్రం విడుదల కానున్న నేపథ్యంలో చిత్రం చూసి మరల ఏం చేయాలనే ఉద్దేశంతో మీడియా ముందుకు వస్తామని స్పష్టం చేశారు. శ్రీకాకుళం జిల్లా మత్స్యకారుల యదార్థ కథతో సినిమా తీస్తున్నాం అని ఎంతో గొప్పగా ప్రకటనలు చేస్తూ ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ గీతా ఆర్ట్స్ పతాకంపై ఈ చిత్రం నిర్మించారన్నారు. పాకిస్తాన్‌లో చిక్కుకున్న వారిని విడుదల చేయించడంలో కృషి చేసిన వారిని ఈ సినిమాలో పూర్తిగా విస్మరించారని విచారం వ్యక్తం చేశారు. పాకిస్తాన్‌లో చిక్కుకున్న శ్రీకాకుళం మత్స్యకారులను విడుదల చేయించే క్రమంలో తాము ఢిల్లీలోని పాకిస్తాన్ రాయబార కార్యాలయానికి పదే పదే తిరిగామని గుర్తు చేశారు. అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని కూడా కలిసి సమస్య వివరించామన్నారు. ఆయన చొరవతోనే సమస్య పరిష్కారం అయిందన్నారు. ఈ సందర్భంగా పలువురు మత్స్యకారులు చిత్రానికి నిరసనగా ప్లకార్డులు ప్రదర్శించారు. బడే ఎల్లాజీ, కారి గురువులు, సురపతి నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

'దామెర్ల పేరుతో అవార్డు ప్రకటించాలి'

మల్కాపురం : ప్రముఖ చిత్రకారుడు, దామెర్ల రామారావు పేరుతో అవార్డు ప్రకటించాలని విశాఖ చిత్ర కళా పరిషత్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. గురువారం బి.ఎస్.ఆర్ భవన్‌లో జరిగిన దామెర్ల శత వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు పరిషత్ అధ్యక్షుడు డి.త్యాగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో చిత్రకళా విమర్శకులు సుంకర చలపతిరావు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని అనుసరించి రాజమహేంద్రవరంలో గల దామెర్ల గ్యాలరీని సాంకేతిక శాఖ నుంచి సాంస్కృతిక శాఖకు బదిలీ చేయాలని కోరారు. ముందుగా చిత్రకారుడు దామెర్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీనియర్ చిత్రకారుడు జి.ఎస్.ప్రకాష్‌ను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో బి.ఎస్.ఆర్. ఫౌండేషన్ కార్యదర్శి బుజ్జి, సుధాకర్, బంగార్రాజు, పీసీ శేఖర్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి చేరికలు


మహిళలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన వాసుపల్లి

దాబాగార్డెన్స్: నియోజకవర్గంలోని 37వ వార్డు నుంచి పలువురు మహిళలు వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీ జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు వాసుపల్లి బంగారమ్మ నేతృత్వంలో తుపాకుల శకుంతల దేవితో పాటు మరి కొంత మంది మహిళలకు మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ వైఎస్సార్‌సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆశీల్‌మెట్టలోని వాసుపల్లి కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలో ఉన్నప్పటికీ వైఎస్సార్‌సీపీ వైపే మొగ్గు చూపుతూ పార్టీలోకి మహిళలు అడుగు పెట్టడం శుభ సూచకమన్నారు. జమిలి ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తారని జోస్యం చెప్పారు. చంద్రబాబు అందలమెక్కడం కోసం అబద్ధాల హామీలతో అధికారంలోకి వచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం తొమ్మిది నెలల పాలనలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమానికి తూట్లు పొడిచారని మండిపడ్డారు. జగన్ హయాంలో రెండు హార్బర్లు ప్రారంభించారని, కొత్త మెడికల్ కళాశాలలు తీసుకొచ్చి భవిష్యత్ తరాలకు నాంది పోసారన్నారు. కానీ చంద్రబాబు మెడికల్ కళాశాలలకు సీట్లు వద్దంటూ కేంద్రానికి లేఖలు రాయడం సిగ్గు చేటన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్ల ఉద్యోగాలు తొలగించి రాక్షస ఆనందం పొందారన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ ఆకుల శ్యామ్, వాళ్లశెట్టి లక్ష్మి, పోలవరపు దుర్గాప్రసాద్, పావనీ, కొండా మాలతి, దుర్గ, గనగళ్ల రామరాజు, చేపల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో టెక్ కార్నర్ ఏర్పాటు


ఐటీఐకి మహేంద్ర సంస్థ అందించిన సామగ్రి

కంచరపాలెం : కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐ (ఓల్డ్)లో టెక్ కార్నర్‌ను గురువారం కళాశాల ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ ప్రారంభించారు. ఈ మేరకు ఐటీఐలోని డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రికల్ ట్రేడ్‌ల విద్యార్థులకు ఆధునిక టెక్నాలజీతో విద్య అందించాలన్న ఉద్దేశంతో మహేంద్ర అండ్ మహేంద్ర సంస్థ సహకారంతో సెంటర్ ఫౌండేషన్ టెక్ కార్నర్‌ని రూపొందించినట్లు తెలిపారు. ఈ ల్యాబ్ నుంచి ఆన్‌లైన్ క్లాసులు వినవచ్చని సెంటర్ ఫౌండేషన్ ప్రతినిధి నవీన్ తెలిపారు. ఈ కంపెనీ ఐటీఐ విద్యార్థుల ట్రైనింగ్ కోసం స్మార్ట్ టీవీ, అత్యాధునిక టూల్ కిట్ అందజేసినట్లు తెలిపారు. సంస్థ అందిస్తున్న సేవలను ప్రిన్సిపాల్ శ్రీకాంత్ అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వై.ఉమాశంకర్, ట్రైనింగ్ ఆఫీసర్ జె.సత్యనారాయణ, అధ్యాపకులు వి.శ్రీనివాసరావు, ట్రైనర్ జె.బాలమురళి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గుండె జబ్బులపై అవగాహన


గుండె జబ్బులపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి రేవతి

గోపాలపట్నం: అగాహనతో గుండె జబ్బు మరణాలను తగ్గించాలని స్టెమి వైద్యాధికారి డాక్టర్ రేవతి అన్నారు. ఈ మేరకు గురువారం గోపాలపట్నం ఇమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ రేవతి మాట్లాడుతూ ప్రజలకు అత్యంత చేరువగా ఉన్న ఆశా వర్కర్లు, ఆరోగ్య కార్యదర్శులు ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గుండె జబ్బులపై అవగాహన కల్పించాలన్నారు. ఛాతీ నొప్పి, ఎడమ భుజం లాగడం, ఆయాసం, గుండెదడ, స్పృహ కోల్పోవడం వంటివి జరిగితే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. గుండె జబ్బు అని నిర్ధారణ అయితే..రూ 45 వేలు విలువల గల ఇంజక్షన్ ఉచితంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వేస్తారని తెలిపారు. దాని వల్ల ప్రాణాలను నిలబెట్టవచ్చని తెలిపారు. అవగాహన కార్యక్రమంలో పలు విభాగా వైద్యులు, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు, సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చీరల పంపిణీ

పెదగంట్యాడ : జీవీఎంసీ 72వ వార్డు పరిధి సమతానగర్‌లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. రోటరీ ఫ్రీ హోమియో క్లినిక్ నేతృత్వంలో జరిగిన ఈ శిబిరంలో అంధులకు స్మార్ట్ విజన్ కళ్లజోళ్లు పంపిణీ చేశారు. క్లినిక్ చైర్మన్ దివంగత విక్టర్‌రాజ్ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు కళ్లజోళ్ల పంపిణీకి ఆర్థిక సాయం అందజేశారు. క్లబ్ ఉపాధ్యక్షుడు సీరట్ల శ్రీనివాస్ అంధులకు కళ్లద్దాలతో పాటు పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.